సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 27 । జనవరి । 2023



ఆకట్టుకున్న శకటాలు
గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో వివిధ శాఖలు ప్రదర్శించిన ప్రగతి శకటాలు ఆకట్టుకున్నాయి. 8లో

బంగారం ధరలు

24 క్యారెట్స్ (10 గ్రా)	రూ.59110
22 క్యారెట్స్ (1 గ్రా) ఆభరణలు	రూ.5,280
జీఎస్టీ 3 శాతం కలిపి	రూ.5,438
బంగారం నవర (8 గ్రా)	రూ.43,504

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.5 /21.0
గురువారం గాలిలో 70 శాతం తేమ ఉంది. శుక్రవారం చలితో కూడిన పొడి వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

జెడ్పీ సర్వసభ్య సమావేశం నేడు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. దీనికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, కలెక్టర్ చక్రధర్‌బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరవుతారన్నారు. వైద్యారోగ్య శాఖ, విద్యా శాఖ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, నీటి యాజమాన్య సంస్థ, వ్యవసాయ శాఖల్లో అమలవుతున్న కార్యక్రమాలపై సమీక్షిస్తామన్నారు. జిల్లా అధికారులు, సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ముగ్గురు ఖైదీల విడుదల

నెల్లూరు(క్రైమ్): ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ఫేజ్–2లో భాగంగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జైళ్లలో జీవితేతర ఖైదీల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా వెంకటాచలం మండలం చెముడుగుంటలోని జిల్లా కేంద్ర కారాగారంలో జీవితేతర ఖైదీలైన కె.వెంకటేష్ అలియాస్ కర్రి, అవుల శ్రీధర్, కె.రాజారెడ్డి అలియాస్ రాజాను జైలు అధికారులు గురువారం విడుదల చేశారు. కుటుంబసభ్యులతో సంతోషంగా జీవించాలని ఈ సందర్భంగా జిల్లా కేంద్రకారాగార సూపరింటెండెంట్ రాజేశ్వరరావు వారికి సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఏబీ కాంతరాజ్, జైలర్లు ఎస్.శ్రీనివాసరావు, వి.రమేష్, డిప్యూటీ జైలర్లు తదితరులు పాల్గొన్నారు. తొలుత కారాగారంలో రాజేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

డీటీసీ ఇన్‌స్పెక్టర్‌గా చిట్టెం బాధ్యతల స్వీకరణ



చిట్టెం కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): వెంకటాచలం మండలంలోని చెముడుగుంటలో ఉన్న జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం (డీటీసీ) ఇన్‌స్పెక్టర్‌గా చిట్టెం కోటేశ్వరరావును నియమిస్తూ గుంటూరు రేంజ్ డీఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోటేశ్వరరావు ఎస్పీ సీహెచ్ విజయారావు, ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, జిల్లా సెబ్ అధికారి కె.శ్రీలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. 1996 బ్యాచ్‌కు చెందిన కోటేశ్వరరావు గతంలో నెల్లూరు నగరంలోని సంతపేట, బుచ్చిరెడ్డిపాళెం సీఐలుగా పనిచేశారు. విధులు నిర్వహించిన ప్రతిచోట సమర్థవంతమైన అధికారిగా పేరుగడించి అధికారులు, ప్రజల మన్ననలు పొందారు.

సంక్షేమం, అభివృద్ధిలో జిల్లా ముందంజ



జాతీయ జెండాను ఎగురవేస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు, పక్కన ఎస్పీ విజయారావు



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు, ప్రధాన న్యాయమూర్తి యామిని, ఉన్నతాధికారులు



జాతీయ జెండా రంగుల్లో..

- కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు
- ఘనంగా గణతంత్ర దినోత్సవం
- పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించిన కలెక్టర్
- అధికారులకు అవార్డుల అందజేత

నెల్లూరు(అర్బన్): 'అభివృద్ధి, సంక్షేమంలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు ఎంతగానో కృషి చేస్తున్నాం. పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వ కార్యక్రమాలను పక్కా ప్రణాళికతో అమలు చేస్తున్నాం.' అని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. నెల్లూరులోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్లో గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. తొలుత కలెక్టర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఎస్పీ విజయారావు ఆధ్వర్యంలో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ, జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ తదితరులు శాంతి కపోతాలను వదిలారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గణతంత్ర దినోత్సవ స్ఫూర్తితో ప్రభుత్వ ఫలాలను ప్రజలకు అందిస్తున్నామన్నారు.

రైతుకు పెట్టుబడి సాయంగా నగదు

ఈ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు సంబంధించిన రైతులకు 561 ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించామన్నారు. 15,859 మంది కౌలు రైతులను గుర్తించి కార్డులు అందజేసి ప్రభుత్వపరంగా ఆదుకుంటున్నామని చెప్పారు. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం ద్వారా జిల్లాలోని 2,10,000 మంది రైతులకు రూ.13,500 చొప్పున నాలుగేళ్ల నుంచి పెట్టుబడి సాయంగా రూ.236 కోట్లను జమ చేశామన్నారు. డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద 402 గ్రూపులకు రూ.38 కోట్ల విలువైన 3,134 యంత్ర పరికరాలు, 233 ట్రాక్టర్లు, 33 వరికోత యంత్రాలు ఇచ్చామన్నారు. జిల్లాలో ఉద్యానవన పంటల అభివృద్ధికి రూ.10.84 కోట్లు మంజూరు చేశామన్నారు. 6,537 మంది బిందు, తుంపర్ల సేద్యం రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్స్ పరికరాలు ఇస్తున్నామన్నారు.

వివిధ పథకాల ద్వారా..

అమ్మఒడి పథకం కింద 2,40,930 మంది తల్లులకు రూ.361.40 కోట్లు అందించామన్నారు. మనబడి నాడు–నేడు రెండోదశకు సంబంధించి రూ.468 కోట్లతో స్కూళ్లలో పనులు జరుగుతున్నాయన్నారు. 23,832 మంది 8వ తరగతి విద్యార్థులకు రూ.33.35 కోట్లతో బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందించామన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద 52,399 మందికి రూ.108.99 కోట్లతో కార్పొరేట్ వైద్యం చేయించామన్నారు. నెల్లూరు నగరంలోని విలీన గ్రామాల్లో రూ.114 కోట్లతో తాగునీటి వసతి, రూ.80 కోట్లతో గోషా ఆస్పత్రి, రోడ్లు, షాదీమంజిల్, బీసీ భవన్ తదితర పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో భూముల రీసర్వే చేసి ప్రభుత్వ ఖర్చుతో సరిహద్దులు ఏర్పాటుచేసి, భూ రికార్డులు నవీకరణ చేసి ఎలాంటి వివాదాలు లేకుండా శాశ్వత హక్కులు కల్పిస్తున్నామన్నారు. 69,087 గృహాలను ప్రజలకు మంజూరు చేయగా నిర్మాణాలు జరుగుతున్నట్లు చెప్పారు. జిల్లాలో 3,15,804 మందికి ప్రతినెలా పెన్షన్ ఇచ్చేందుకు రూ.87.71 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా పొదుపు సభ్యులకు రూ.896 కోట్లు రుణాలు అందించామన్నారు. నెల్లూరు నగరంలో 13 వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లను రూ.13.98 కోట్లతో నిర్మించి ప్రజలకు వైద్యం అందిస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఈ సంవత్సరంలో 85.45 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. వైఎస్సార్ జలకళ పథకం కింద రూ.11.35 కోట్లతో 284 బోర్లను రైతులకు వేయించామన్నారు. ఎన్‌డీబీ ప్రాజెక్టు కింద మండలాల నుంచి జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు రూ.422.80 కోట్లతో 15 రహదారి పనులు ఆమోదించామన్నారు. చెన్నై – కోల్‌కతా రహదారికి రూ.55 కోట్లు మంజూరయ్యాయన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతులు కల్పించేందుకు రూ.115 కోట్లు కేటాయించారన్నారు. జల్‌జీవన్ మిషన్ కింద తొలిదశలో రూ.253.16 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

రెండు మెగా బ్యారేజీల పూర్తి

రూ.500 కోట్లతో పెన్నానదిపై నెల్లూరు నగరంలో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి బ్యారేజీ, సంగం వద్ద మేకపాటి గౌతమ్‌రెడ్డి మెగా బ్యారేజీలు పూర్తి చేసి సాగు, తాగునీరుకు ఢోకా లేకుండా చేశామన్నారు. నగరంలోని సర్వేపల్లి కాలువ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు రూ.83.70 కోట్లతో, జాఫర్‌సాహెబ్ కాలువ గోడల నిర్మాణ పనులు రూ.75.3 కోట్లతో, మలిదేవి మేజర్ డ్రెయిన్ నిర్మాణ పనులు రూ.69.9 కోట్లతో జరుగుతున్నాయన్నారు. ఆనం సంజీవరెడ్డి ఎత్తిపోతల పథకం ఫేజ్–1 పనులు రూ.853.82 కోట్లతో, ఫేజ్–2 కింద రూ 648.98 కోట్లతో పనులు చేస్తున్నారన్నారు. రూ.632 కోట్లతో ఉత్తరకాలువ వెడల్పు పనులు, సోమశిల డ్యాం వద్ద ఆప్రాన్ పునరుద్ధరణకు రూ.117 కోట్లతో పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో కండలేరు జలాశయం కింద 2.95 లక్షల సాగునీరు, చెన్నై నగరానికి 5 టీఎంసీల తాగునీరు అందిస్తున్నామన్నారు. 1.91 లక్షల మంది రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం రూ.70 కోట్లు విడుదల చేసిందన్నారు. 10,689 మంది మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో రూ.10.68 కోట్లను ప్రభుత్వం అందించిందన్నారు. జువ్వలదిన్నె గ్రామం వద్ద రూ.288 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఆరువేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహాలు అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఏపీఐఐసీ పరిధిలో రూ.42.20 కోట్లతో 210 మంది పారిశ్రామికవేత్తలకు సహకారం అందించామన్నారు. ఆత్మకూరులో ప్లాస్టిక్, ప్యాకేజింగ్ పరిశ్రమల కోసం 174 ఎకరాల్లో ఎంఎస్ఈ పార్కును ఏర్పాటు చేశామన్నారు. మిథానీ, క్రిబ్‌కో లాంటి భారీ పరిశ్రమల ఏర్పాటుకు అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ పరిశ్రమల ద్వారా సుమారు 1,000 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఇంకా వైఎస్సార్ నేతన్న పథకం ద్వారా 3,644 మందికి రూ.8,74,56,000ను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. పోలీసు, సెబ్ ద్వారా నాటుసారా, మద్యం అక్రమ రవాణాను అరికడుతూ శాంతిభద్రతలను కాపాడుతున్నామన్నారు. జిల్లాకు పీఎంఎజీవై కింద అవార్డు, వ్యవసాయ శాఖకు పురస్కారం తదితర అవార్డులు దక్కాయన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, వాకాటి నారాయణరెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, అన్ని శాఖల అధికారులు, పుర ప్రముఖులు, ప్రజలు హాజరయ్యారు.

మీ సేవలకు సలాం

వివిధ శాఖల్లో విశేష ప్రతిభ చూపిన 705 మందికి కలెక్టర్ చక్రధర్‌బాబు అవార్డులు అందించారు. వారిలో జేసీ కూర్మనాథ్, కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, సిబ్బంది ఉన్నారు. ఇంకా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి కూడా ప్రశంసాపత్రాలను అందజేశారు.
– నెల్లూరు(అర్బన్)



కలెక్టర్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న జేసీ కూర్మనాథ్



శోభిక, కందుకూరు సబ్‌కలెక్టర్



శీనానాయక్, కావలి ఆర్డీఓ



షఫీమాలిక్, కలెక్టరేట్ పరిపాలనాధికారి



సుధాకర్‌రాజు, వ్యవసాయశాఖ జేడీ



హనుమాన్ ప్రసాద్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్



నాగేశ్వరరావు, మత్స్యశాఖ జేడీ



డాక్టర్ రమేష్‌నాథ్, డీసీహెచ్ఎస్



పవన్‌కుమార్, 108, 104 వాహనాల జిల్లా మేనేజర్



రవిసింగ్, నాబార్డు డీడీఎం



సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ



నాగరాజకుమారి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ



వెంకటయ్య, బీసీ సంక్షేమ శాఖాధికారి



కనకదుర్గాభవాని, మైనార్టీ సంక్షేమశాఖాధికారి



సురేష్‌కుమార్, జిల్లా ఉపాధికల్పనాధికారి



తిరుపాల్‌రెడ్డి, డీసీఓ



మందా రాణి, ఐటీడీఏ పీఓ



ఉషారాణి, సమగ్రశిక్ష ఏపీసీ



మారుతీప్రసాద్, పరిశ్రమల శాఖ జీఎం



ఆర్అండ్‌బీ డీఈఈ కె.చక్రధరరావు, ఇతర అధికారులు



అవార్డు అందుకుంటున్న డెమో సునీత, చిత్రంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



అవార్డు స్వీకరిస్తున్న జిల్లా పౌరసరఫరాల శాఖ ఉద్యోగులతో డీఎస్ఓ వెంకటేశ్వర్లు

పోలీస్, జైళ్లు తదితర శాఖల్లో..

విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పోలీసు, సెబ్, ఎక్సైజ్, అగ్నిమాపక శాఖ, జైళ్లు, సీఐడీ తదితర శాఖల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్పీ సీహెచ్ విజయారావు ప్రశంసాపత్రాలను అందజేశారు.
– నెల్లూరు(క్రైమ్)



కలెక్టర్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న జిల్లా సెబ్ అధికారిణి శ్రీలక్ష్మి



జిల్లా కేంద్రకారాగార ఉపపర్యవేక్షణాధికారి బెంజిమన్ కాంతరాజు, జైలర్ రమేష్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ నిరంజన్, హెడ్ వార్డర్ సి.నరేందర్‌రెడ్డి



శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి



ఎన్.కోటారెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ



మిద్దె నాగేశ్వరమ్మ, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్



శ్రీనివాసులురెడ్డి, ఆర్ఐ అడ్మిన్

క్రీడాకారులకు..

రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన జిల్లాకు చెందిన క్రీడాకారులకు, క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందజేశారు.
– నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆర్చరీ ప్లేయర్ అక్షయ్ రమణ



సుగుణ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ



సాయి లోకేష్, రోలర్ స్కేటింగ్




మహేంద్ర, బ్యాడ్మింటన్ ప్లేయర్



ప్రవీణ్ గిర్వాన్, ఆర్చరీ ప్లేయర్

సోమశిలలో 70.166 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం నాటికి 70.166 టీఎంసీలున్నాయి. జలాశయానికి 1,595 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. ఉత్తరకాలువకు 650, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 99.508 మీటర్ల నీటి మట్టం ఉంది.

108లో ఈఎంటీ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో 108 ఎమర్జెన్సీ వాహనాల్లో ఖాళీగా ఉన్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని అరబిందో మెడికల్ సర్వీసెస్ 108, 104 వాహనాల జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండాపురం, కలిగిరి, బోగోలు, కావలి, అల్లూరు, ఉలవపాడు, గుడ్లూరు, కందుకూరు, లింగసముద్రం, కలువాయి, పొదలకూరు, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం, చేజర్ల, నెల్లూరు, ముత్తుకూరు, టీపీ గూడూరు తదితర మండలాల్లో పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం నర్సింగ్, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీఎంఎల్‌టీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ కోర్సులు చదివి ఐదేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ ధ్రువీకరణపత్రాలతోపాటు బయోడేటా ఫారంతో ఈనెల 30వ తేదీలోపు నెల్లూరు ప్రభుత్వ పెద్దాస్పత్రి ఆవరణలోని దిశ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న 108 ఆఫీస్‌లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఉప్పొంగిన దేశభక్తి

గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని పోలీసు పరేడ్ మైదానం పోలీసుల కవాతు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తి గీతాలతో మార్మోగిపోయింది. దీంతో ప్రతి ఒక్కరి మదిలో దేశభక్తి ఉప్పొంగింది. ప్రభుత్వ శాఖలకు సంబంధించి జరిగిన అభివృద్ధిపై అధికారులు ప్రదర్శించిన ప్రగతి శకటాలు ఆకట్టుకున్నాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన శకటాలకు కలెక్టర్ చక్రధర్‌బాబు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. అలాగే ప్రతి మదిని దేశభక్తితో ఉప్పొంగేలా సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన అన్ని పాఠశాలల విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు.


స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో అలరిస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న శకటాలు



మొదటి బహుమతి అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది, డీఆర్‌డీఏ శకటం ప్రదర్శన



రెండో బహుమతి పొందిన ఐటీడీఏ, జిల్లా పంచాయతీశాఖ శకటాలు



మూడో బహుమతి అందుకున్న వైద్యశాఖ, అటవీశాఖ శకటాలు

- అభివృద్ధిని కళ్లకు కట్టిన ప్రభుత్వ శకటాలు
- డీఆర్‌డీఏ, అగ్నిమాపక శాఖల శకటాలకు మొదటి బహుమతి
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ శాఖలకు సంబంధించి అభివృద్ధిని కళ్లకు కట్టినట్టు ఆయా శాఖల అధికారులు అభివృద్ధి రథాల(ప్రగతి శకటాల)ను ప్రదర్శించారు. జీవివైవిధ్య ఆవశ్యకత, ఎకో పార్కులు, జగనన్న పచ్చతోరణం, వన్యప్రాణులు గురించి అటవీ శాఖాధికారులు ప్రదర్శించిన శకటం ఎంతో ఆకట్టుకుంది. 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' శకటాన్ని గృహ నిర్మాణశాఖ ప్రదర్శించింది. కుటుంబ ఆరోగ్యమే సమాజ ఆరోగ్యమంటూ వైద్యశాఖ శకటాన్ని ప్రదర్శించగా ఇందులో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ఆకట్టుకుంది. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల పథకానికి సంబంధించిన శకటాన్ని ప్రదర్శిస్తూ బిందుసేద్యం, తుంపర్ల సేద్యంతో తక్కువ నీటిని వినియోగించుకుని మంచి పంటలు పండించడాన్ని వివరించారు. జిల్లా పంచాయతీశాఖ ఆధ్వర్యంలో జగనన్న స్వచ్ఛసంకల్పం, ప్లాస్టిక్ నివారణ తదితర అంశాలతో శకటాన్ని ప్రదర్శించారు. స్వయం సహాయక సంఘాలు – మహిళా సాధికారతపై డీఆర్‌డీఏ శకటాన్ని ప్రదర్శించింది. విద్య ఆవశ్యకతను వివరిస్తూ విద్యాశాఖ – సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో, గిరిజన సంక్షేమంపై ఐటీడీఏ ఆధ్వర్యంలో, పౌష్టికాహారం, తల్లిబిడ్డ సంరక్షణపై స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో, అగ్నిప్రమాదాలు, విపత్తులు, వరదలు వచ్చినప్పుడు ప్రజలను కాపాడే విధానం గురించి అగ్నిమాపకశాఖ ప్రదర్శించిన శకటం ఎంతగానో ఆకట్టుకున్నాయి.


కలెక్టర్ చక్రధర్‌బాబు చేతులమీదుగా జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థులు


వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ పొట్లూరి స్రవంతి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి

కవాతు సూపర్



నెల్లూరు(క్రైమ్): గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు కవాతు మైదానంలో అడ్మిన్ ఆర్‌ఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రజల ప్రాణాలు, ఆస్తుల ఎలా రక్షించాలి.. మంటలను ఎలా ఆర్పాలో ఇచ్చిన డెమో, అగ్నిమాపక శకట విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మది పులకించేలా..

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన దృశ్య రూపకాలు దేశభక్తి ఉప్పొంగేలా ఉన్నాయి. వారి ప్రదర్శనలు చూపరుల మదిని పులకింపజేశాయి. నెల్లూరులోని శ్రీచైతన్య ఇంగ్లిషు మీడియం హైస్కూల్ విద్యార్థినులు, చెముడుగుంటలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు, సిల్వర్ ఓక్స్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే రత్నం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన విజయీభవ, ఇందుకూరుపేటకు చెందిన ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన బోలో తరార, గొలగమూడిలోని ఏపీ ట్రైబల్ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన థింసా నృత్యం, ముత్తుకూరులోని ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన 'మనదేశం భారతదేశం – మనమంతా భారతీయులం' అనే దృశ్యరూపకాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అన్ని పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు అద్భుతంగా ఉండడంతో ఆయా పాఠశాలల విద్యార్థులకు కలెక్టర్ చక్రధర్‌బాబు చేతులమీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

అత్యుత్తమ ప్రదర్శన

అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి ఆకట్టుకున్న అగ్నిమాపకశాఖ శకటం, డీఆర్‌డీఏ శకటాలకు సంయుక్తంగా మొదటి బహుమతి లభించింది. ఐటీడీఏ, జిల్లా పంచాయతీశాఖ ప్రదర్శించిన శకటాలు సంయుక్తంగా రెండో బహుమతి పొందాయి. వైద్యశాఖ, అటవీశాఖల శకటాలకు సంయుక్తంగా మూడో బహుమతి లభించింది. ఆయా శాఖల శకటాలకు సంబంధించి అగ్నిమాపక శాఖాధికారి శ్రీకాంత్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఐటీడీఏ పీఓ మందా రాణి, డీపీఓ చిరంజీవి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, డీఎఫ్‌ఓ చంద్రశేఖర్‌లు కలెక్టర్ చక్రధర్‌బాబు చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు.


సిల్వర్ ఓక్స్ పాఠశాల విద్యార్థుల విన్యాసాలు


కొండాయపాళెం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థుల ప్రదర్శన


చెముడుగుంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు


గొలగమూడి ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన


సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు


కలెక్టర్ చేతులమీదుగా జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థులు


ముత్తుకూరు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి


సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన వారితో కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ చక్రధర్‌బాబు
- కస్తూర్బా కళాక్షేత్రంలో అలరించిన సాంస్కృతిక కళారూపాలు

నెల్లూరు(అర్బన్): విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించి అన్నిరంగాల్లో రాణిస్తూ తల్లిదండ్రులకు, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు సూచించారు. గురువారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో అట్టహాసంగా సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికష్టాలు వచ్చినా విద్యలో రాణించాలన్నారు. స్వాతంత్ర్య పోరాట వీరులు ఎన్నికష్టాలు వచ్చినా తమ లక్ష్యాన్ని వీడలేదని, అలాగే విద్యార్థులు కూడా కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమారులు కేవీ అభిరామ్, అనిరుధ్ పియానో వాయించి అందరినీ అబ్బురపరిచారు. సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శించిన వారందరికీ కలెక్టర్ జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ డీడీ వెంకటేశ్వరప్రసాద్, రూరల్ తహసీల్దార్ నాజర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


పియానో వాయిస్తున్న కలెక్టర్ కుమారులు

ఉత్తమ సేవలకు ప్రశంస

- ఎస్పీ చేతులమీదుగా పురస్కారం

నెల్లూరు(క్రైమ్): కోవిడ్ సమయంలో ఉత్తమ సేవలందించినందుకు గాను ఏఆర్ డీఎస్పీ జి.ఎం.గాంధీకి రాష్ట్ర డీజీ కార్యాలయం నుంచి ప్రశంసాపత్రం పోస్టు ద్వారా పంపారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఎస్పీ సీహెచ్ విజయారావు చేతులమీదుగా డీఎస్పీ గాంధీ ఆ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. కోవిడ్ సమయంలో స్టేట్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఆయన సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు గాను ఈ ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


ఎస్పీ చేతుమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏఆర్ డీఎస్పీ గాంధీ

ఇంటి తలుపులు పగులగొట్టి చోరీ

- 8 సవర్ల బంగారు ఆభరణాల అపహరణ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని పెనుబల్లి గ్రామానికి చెందిన తాళ్ల ప్రదీప్ అనే వ్యక్తి ఇంట్లో గురువారం వేకువజామున గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు ప్రదీప్ ట్రావెల్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడురు. ప్రదీప్ విధులకు వెళ్లగా అతని భార్య తన తమ్ముడు నిశ్చితార్థమై మండలంలోని దామరమడుగులోని తన అమ్మగారి ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూలేరని గమనించిన దుండగులు ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. అనంతరం ఇంట్లోని బీరువా తలుపులను పగలగొట్టి అందులోని 8 సవర్ల బంగారు ఆభరణాలు, తన బావమరిది నిశ్చితార్థం కోసంగా తెచ్చిన రూ.లక్ష నగదును అపహరించుకుపోయారు. ఉదయాన్నే ప్రదీప్ తల్లి పక్కనే నివాసం ఉంటున్న తన కొడుకు ఇంటికి వెళ్లి చూడగా తలుపులు పగలగొట్టి ఉండడాన్ని చూసి అతనికి ఫోన్ చేసింది. వెంటనే ఇంటికి చేరుకున్న ప్రదీప్ ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- మహిళ దుర్మరణం

మనుబోలు: బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం పాలైంది. ఈ ఘటన మనుబోలు మండల పరిధిలోని మనుబోలు – పొదలకూరు రహదారిపై నాయుడుపాళెం సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు పొదలకూరుకు చెందిన కాకి మరియమ్మ(42) గూడూరు కోర్టులో స్వీపర్‌గా పనిచేస్తోంది. అదే కోర్టులో అటెండర్‌గా పనిచేస్తున్న దినేష్‌కుమార్‌తో కలిసి విధులకు వెళ్లేందుకు పొదలకూరు నుంచి బైక్‌పై బయలుదేరింది. నాయుడుపల్లి సమీపంలోకి వచ్చేసరికి గూడూరు నుంచి పొదలకూరుకు సవక కర్రల లోడుతో వెళుతున్న లారీ వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మరియమ్మ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. దినేష్ కుమార్ హెల్మెట్ ధరించి ఉండడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అతనిని చికిత్సనిమిత్తం గూడూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీఐ సంగమేశ్వరరావు, ఎస్సై ముత్యాలరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మరియమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మరియమ్మ మృతదేహం

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.12
పండ్లు	: రూ.5



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 109
లేయర్ (లైవ్)	: 88
బ్రాయిలర్ చికెన్	: 194
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 216
లేయర్ చికెన్	: 150